



# మంచుకన్న తెల్లనైన మనసులున్నదెవరికి?

మర్రిమాను కింద ఏ మొక్కా బతకదనేది పాత మాట.

ఐవోర్ల కొడుకులున్న బడిలో నాబోటి పిల్లోడెవడూ ఎంత టాలెంటున్నా పైకి రాలేడ నేది నేను కనిపెట్టిన కొత్త మాట.

ఎట్టాగంటారా? చెప్తా.

మనకి చిన్నప్పటాల్నించి పాటలు వొచ్చు. మా అమ్మకి రావు. మా నాయనకి రావు. మా నాయనమ్మ ఎప్పుడైనా గ్యార్‌వీలప్పుడు గొంతు సవరదీసుకొని ఖసీదాలు పాడు తుందిగానీ ఆయమ్మకి గూడా రావు. అయినాగానీ నాకొచ్చినాయి.

మా నాయన కరెంటు మనిషి గాబట్టి ఆయన మా వూర్లో పెళ్లిళ్లకీ పోగ్రాములకీ పాటలు మోగించాలి గాబట్టి మాకాడ రికార్డు ప్లేయర్లు, ఎప్పటికప్పుడు కొత్తగా వొచ్చే రికార్డులు ఉండేయి. పొద్దుపోనప్పుడల్లా నేను వాటిని వింటా ఉండేవాణ్ణి. అందువల్ల నాకు పాటలన్నీ నోటికి వచ్చు. దేవుడి దయ వల్ల పాడటం గూడా వొచ్చు. నేను పాడతా

ఉంటే ఎవ్వరూ కిందలుగా నవ్వకుండా బాగుందిరే అని తలకాయ ఆడించేలా చెయ్యగల ను.

అయితే యింత టాలెంటు ఉండి కూడా అది మా ఇశ్కోదయలో పనికిరాకుండా పాయెనే అని నా బాద.

మా ఇశ్కోదయలో ప్రతి సంవచ్చరం యానివసరీ ఉంటుంది. ఆ యానివసరీకి ముందు పిలకాయలకి పోటీలు ఉంటాయి. ఆటల పోటీలో ఎట్టా మన అంకె లాస్టుగా బట్టి పాటల పోటీలో అయినా ఫస్టు నిలబడదాం అని నా యింట్రెస్టు. కానీ అదంత సులువుగాదని నాకు తర్వాత తెలిసొచ్చింది.

ఎందుకంటే మా ఇశ్కోదయలో ఐవోర్ల కొడుకులు చానా మంది ఉన్నారు. నరసయ్య ఐవోరి కొడుకు లక్ష్మణ కుమార్ అని ఉన్నాడు. వాడు మా కిలాసే. బి.సుదాకర్ ఐవోరికి ఇద్దరు కొడుకులున్నారు. వాళ్లు మా బడే. సోషలు చెప్పే రాఘవయ్యకి ఒక కొడుకున్నాడు క్రిష్ణ అని. వాడు మా పైకిలాసు. మదుసూదనరావు ఐవోరి కొడుకొకడు. చిన్న పి.టి ఐవోరి కొడుకు యింకొకడు.

వీళ్లు గాకుండా మా పక్కన్నే ఉండే జవహర్‌బారతి కాలేజీ లెక్చరర్ల కొడుకులు కూడా చాలామంది మా ఇశ్కోదయలో మాతో పాటు చదవతా ఉన్నారు. ఐవోర్ల కొడుకులని చూసే బయం బక్తులతో అణిగి మణిగి ఉంటా ఉంటే, యింకీ లెక్చరర్ల కొడుకుల టిప్పు టాపు చూసి యింకా వొంగి వొంగి నడవాల్సి వొచ్చేది మాకు.

వీళ్లంతా మా ఇస్కూలికి పెద్ద పెద్ద క్లవర్లని వాళ్ల పాటికి వాళ్లు అనుకుంటా ఉండే వాళ్లు. చదువులో ఎట్టా ఫస్టు వస్తున్నాం గదా ఆటపాటల్లో ఎందుకు రాకూడదు అనేది యీళ్ల దియరీ. అందుకని ఏది వొచ్చినా ఏది రాకపోయినా ప్రతి పోటీలో పేరిచ్చి మేమున్నాం అంటా తయారైపోతా ఉండేవాళ్లు.

ఇంక నా బోటి వాడికి ప్రైజులు రమ్మంటే వొస్తాయా?

అనుకున్నట్టుగానే ఆ సంవచ్చరం మా నోటీసుబోర్డు మీద పాటల పోటీ అనౌన్సుమెంటు రాపిచ్చినాడు కుమారస్వామి ఐవోరు.

'ఫలానా రోజున సాయంత్రం లాస్టు పిరీడు ఉండదు. యిద్యార్థులంతా బాస్కెట్ బాలు కోర్టు కాడికొచ్చి కూచోవాలి. పాటల పోటీ ఉంటుంది. పోటీలో పాల్గొనే యిద్యార్థులు ఈ రోజు సాయంత్రం లోపల పేర్లు యియ్యండి'... అని దాని పాటం.

కాండూరి మురళీగాడు, నేనూ, పిలకాయలందరం దాని చుట్టే మూగినాం.

'ఈసారి ఎట్టాగైనా ప్రైయిజు నాకేరా. ఇప్పుడే బజారికి పోతా. గంటసాల పాటల పుస్తకం కొనుక్కుంటా. ఇంక చూసుకో' అన్నాడొకడు, బాలుర సంక్షేమ హాస్టలు వాడు.

'గంటసాల పాటలు అందరూ పాడతార్రా. జేసుదాసు పాట పాడితే ప్రైయిజు గ్యారంటీరా. ఆకాశదేశాన ఆషాడమాసాన... పాడతా. ఎవరడ్డం వస్తారో చూస్తా' అన్నాడింకొకడు.

'చచ.. పాడితే ఎస్‌రామక్రిష్ణ పాట పాడాలిరా. అనురాగం ఆత్మీయత అంతా ఒక బూటకం అని ఎత్తుకుంటే ఐవోర్లంతా బొటబొటమని కళ్లమ్మట నీళ్లు పెట్టుకొని ప్రైయిజ్ యిస్తార్రా' అన్నాడింకొకడు.

మురళీగాడు కూడా వాడి ప్లానల్లో వాడున్నాడు.

నేను మాత్రం అన్నీ వింటా గమ్మున్గా ఉన్నా. ఎందుకంటే మన ప్లాను వేరు. మనం ఎస్‌పి బాలసుబ్రమణ్యం ఫాన్సు. ఆయన పాడిన కత్తిలాంటి పాటలు రెండున్నాయి మనకాడ.

ఒకటి జస్టిస్ చౌదరిలో 'చట్టానికి న్యాయానికి జరిగిన ఈ సమరంలో'...

రెండు ప్రేమాబిషేకంలో 'వందనం అబివందనం నీ అందమే ఒక నందనం'...

మొదటి పాటలో రామారావు చెప్పే 'ఐయామ్ ఇన్ హాండ్స్ ఆఫ్ లా'.. లాంటి ఇంగ్లీషు మాటలని ఈ పోటీ కోసం మా ఇంగ్లీషు ఐవోరి చేత ముందే చెప్పించుకొని ఉన్నా.

'ఇది ఆ దైవమే ఇచ్చిన తీర్పు'... అని దీర్గం తీశాక రామారావులాగా వొత్తు మీద వొత్తు పెట్టి మరీ 'తఫ్హా తఫ్హా తఫ్హా... నో' అని అనడం కూడా నేర్చుకున్నా.

'వందనం అబివందనం'లో అయితే ఎఎన్నార్‌లాగా తడవకోసారి 'హి హ హ హ' అని నవ్వడం కూడా ప్రాక్టీసు చేశా. ఈ రెంటింటిలో ఏదో ఒకటి పాడితే ప్రైయిజు నాకే అని నాకు తెలుసు. అందుకే గమ్మున్గా యింటికి పొయ్యి మా మిద్దెక్కి పెద్ద పెద్దగా ఆ రెండు పాటలనీ నాకు నేనే ఒప్పజెప్పుకున్నా.

పోటీ రోజొచ్చింది. గుండె గుబాగుబామంటా ఉంది.

హాస్టలు పిలకాయలు, సిసెక్షన్ పిలకాయలు, నేను, మా మురళీగాడు అందరం ఎవరి పాటికి వాళ్లం మనసు మనసులోనే పాటలని ప్రాక్టీసు చేసుకుంటా ఉన్నాం. కాసేపటికి ఐవోర్ల కొడుకులు గుంబనంగా వచ్చి కూచున్నారు. వాళ్ల ఎనకాతలే ఐవోర్లు.

పొడుగు చేతుల చొక్కాని నిండుగా బటన్లు పెట్టి కుమారస్వామి ఐవోరు జడ్జీగా వొచ్చి కూచున్నాడు. ఇంకో జడ్జి జె.నాగేశ్వరరావు ఐవోరు.

మైకు పెట్టారు. ఇంక పాడాలి.

మొదట బాలుర సంక్షేమ హాస్టల్లో చదివే ఒక పిల్లోడు పోయి నిలబడ్డాడు మైకు కాడ.

రెండు చేతులు కట్టుకొని, ఒక నిమిషం గ్యాపిచ్చి, ఊపిరి బిగబట్టి, 'అహో ఆంధ్ర బోజా... శ్రీకృష్ణ దేవరాయా'... అని ఎత్తుకున్నాడు.

దీర్గం బాగుంది. గొంతు గంటసాలను అట్టే దించేశాడు. అబ్బా ప్రైయిజు యీడికేరా అని అనుకుంటూ ఉండగానే 'చిలలపై చిల్పాలు సెక్కినారూ'... అని కొట్టాడు దెబ్బ.

ఎప్పుడైతే వాడు 'శ'కు 'చ', 'చ'కు 'స' పెట్టినాడో అప్పుడే ఔటు.

నెక్స్టు జేసుదాసు అబిమాని గాడు. వాడు ఆ రోజున పైకి 'ఆకాశ దేశాన ఆషాఢ మాసాన' పాడతానని అన్నాడుగదా. అది ఉత్త డావు. వాడి అసలు పాట శోబన్‌బాబుకు జేసుదాసు పాడిన 'గాలివానలో వాననీటిలో పడవ ప్రయాణం'... వాడు దానిని యిర గదీసి మరగదీసి ఉతికారబెట్టి కూచున్నాడు. అందరం బలే చప్పట్లు కొట్టినాం వాడి పాటకి.

ఆ తర్వాత ఎస్‌రామక్రిష్ణ ఫాన్సు.

'అనురాగం ఆత్మీయత అంతా ఒక బూటకం' అని వాడు పాడతా ఉంటే ఐవోర్లు కళ్ల మ్మట నీళ్లు పెట్టుకోకపోయినా 'అరెరె... యీడికేమైంది పాపం' అన్నట్టుగా పాటంతా విన్నారు.

ఆ తర్వాత మళ్లా యిద్దరు పాడారు. ఒకడికి గొంతు లేదు. ఇంకొకడు పాట మధ్యలో మర్చిపోయాడు.

అప్పుడు నా పేరు పిలిచారు. ఒక్క ఊపులో గత్ మంటా లేచి నిలబడినాను. గంబీ రంగా మైకు దాకా నడుచుకుంటా పొయ్యి, మైకు పని చేస్తా ఉందో లేదో అని దాని మీద మూడుసార్లు వేలితో తట్టి, అందరినీ ఒకసారి గమనించుకొని 'చట్టానికి న్యాయానికి జరిగిన ఈ సమరంలో' అని అందుకున్నాను.

ఎప్పుడైతే పాట అందుకున్నానో అప్పుడే నాకు ఎన్టీఆర్ పూనాడు. పల్లవి పూర్తి కాగానే చొక్కా పై గుండీ విప్పి కోటు లాగా పట్టుకొని చరణంలోని 'కఠినమైనది దర్మం కన్నులే నిది న్యాయం' అని నేను పాడతా ఉంటే ఐవోర్లు ముక్కు మీద ఏలేసుకున్నారు. పిలకా యలు లేచి డాన్సు ఆడారు. పాటంతా అయ్యాక చొక్కా గుండీలు పెట్టుకొని ఏమెరగ నట్టుగా వచ్చి కూచుంటుంటే 'ప్రైయిజు నీకేరా ప్రైయిజు నీకేరా' అన్నారంతా.

కానీ అప్పుడు మొదలయ్యింది ఐవోర్ల కొడుకుల, క్లవర్ల దాడి మా మీద.

మొదట నరసయ్య ఐవోరి కొడుకు లక్ష్మణ కుమార్ వొచ్చాడు.

వాడు మంచి సింగరు. గొంతు బాగుంటుంది. వాడు పాడిన పాట కూడా బాగుంది. అది సినిమా పాట కాదు. దాని పల్లవి:

'మంచుకన్న తెల్లనైన మనసులున్న దెవరికి?

మంచిని ప్రేమించి పెంచు మమతలెవరివి?'...

ఇది చిన్నపిలకాయల మీద ఎస్.వి.బుజంగరాయ శర్మ అనే ఆయన రాసిన పాటంట. ఆయన మా జవహర్‌బారతిలో తెలుగు లెక్చరర్ అంట. చాలా పెద్ద కవి అంట. ఆ పాట విన్నాక పిలకాయలు చప్పట్లు కొట్టలేదుగానీ ఐవోర్లంతా పెద్దగా చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత 'ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి' అని మా పైకిలాసు అబ్బాయి వచ్చాడు. ఆ పిల్లోడు 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయి' అని కవిత్వం చెప్పిన ఇంద్రగంటి హనుమ చ్ఛాస్త్రి (ఆయన పేరే వీడికి పెట్టారు) మనవడంట. నాకు మాత్రం జవహర్‌బారతిలో తెలు గుచెప్పే ఇంద్రగంటి బానుమూర్తి ఐవోరి కొడుగ్గా తెలుసు.

అతడొచ్చి, అమిత వైనంగా నిలబడి-

'తేనెల తేటల మాటలతో మన దేశమాతనే కొలిచెదమా

బావం బాగ్యం చూచుకొని యిక జీవనయానం చేయుదమా' అని దేశబక్తి గీతం పాడేశాడు. దానిని రాసింది ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అని ఇంకో పెద్ద కవి అని, ఆయన ఈ అబ్బాయికి బాబాయి అని ఆ తర్వాత తెలిసింది.

ఆ తర్వాత జి.వెంకటేష్ అనే ఇంకొక క్లవరు వచ్చి- 'తల నిండ పూదండ దాల్చిన రాణి' అని పాడితే, మరో క్లవరు వచ్చి 'కొండల్లో నెలకొన్న కోనేటిరాయడు వాడు' పాడాడు. పైనలు టచ్చుగా ఇంకొకడొచ్చి 'శంకరా నాద శరీరాపరా'తో పోటీ ముగించాడు.

ఫస్టు ప్రైయిజు 'మంచుకన్న తెల్లనైన'కు పోయింది. ఆ తర్వాతి ప్రైయిజులు కూడా అదే వరుసలో పోయాయి.

నాకు చాలా బాదేసింది - కన్సొలేషన్ కూడా యియ్యకపోతిరే అని.

'ఇదంతా ముందే ప్లానురా. ఐవోర్ల కొడుకులు కాబట్టి వాళ్లకే యిచ్చారురా' అన్నాను కాండూరి మురళీగాడితో.

వాడు కూడా పోటీలో 'నా పేరే యుగంధర్ యుగంధర్ యుగంధర్' పాడి అడ్రసు లేకుండా పొయ్యాడు.

'అదేం కాదురా. నాకిప్పుడు అర్థమయ్యింది. పాటల పోటీలో సినిమా పాటలు పాడ కూడదురా. ప్రయివేటు పాటలు పాడాలి. సినిమా పాటలు పాడినా మల్లియలారా మాలి కలారా లాంటి మంచి మంచి పాటలు పాడాలిరా. అప్పుడే ప్రైయిజులొస్తాయి' అన్నాడు మురళీగాడు.

'ప్రయివేటు పాటలు మనకెట్టా తెలుస్తాయిరా? వాళ్ల నాయన్లు ఐవోర్లు గాబట్టి సంపా దించి పెట్టుంటారు' అన్నాను.

'మనం కూడా ట్రయి చెయ్యాలిరా' అన్నాడు వాడు.

ఆ తర్వాత మేము చాలా వెతికి వెతికి రెండు ప్రయివేటు పాటలు సంపాదించాం.

ఒకటి: 'నేనొక పూలమొక్క కడ నిల్చి... చివాలున కొమ్మ వంచి' ఎంత కష్టమైనా యిదే కావాలని చెప్పి నేను దీనినే సెలెక్టు చేసుకున్నాను.

రెండు: 'రావోయి బంగారిమామా'... దీనిని మురళీగాడు సెలెక్ట్ చేసుకున్నాడు.

ఆ మరుసటి సంవచ్చరం పాటల పోటీలో క్లవర్లు మా దెబ్బకి పోయి పూనాలో పడక పోయినా, సెకెండు తర్డు ప్రైయిజులు మాత్రం మాకే సమర్పించుకొని దణ్ణం పెట్టేశారు. ■